సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 14 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.29 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29 వేలు, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
29.6°/ 19.8°
జిల్లాలో శుక్రవారం తుపాను వాతావరణం నెలకొంది. చలి తీవ్రత కొనసాగుతోంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.


పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నినదిస్తున్న ఉషశ్రీచరణ్


ర్యాలీలో పాల్గొనేందుకు ఎద్దులబండిపై వస్తున్న రైతులు

అడుగుకు అడుగు తోడైంది. కర్షకుడి కోసం కదిలి వచ్చింది. సర్కార్ నమ్మకద్రోహంపై గొంతెత్తి నినదించింది. హామీ అమలు చేయాల్సిందేనంటూ డిమాండ్ చేసింది. 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ పోరుబాట' కార్యక్రమం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తి పోటెత్తింది. కూటమి సర్కార్ నిర్బంధాలను ఎదురించి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి రైతులతో కలిసి కదం తొక్కారు. రైతుకు అన్యాయం చేస్తే సహించబోమంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దిక్కులుపిక్కటిల్లేలా చేసిన రైతుగర్జనతో కూటమి నేతల్లో వణుకుపుట్టింది.


'అన్నదాత కోసం వైఎస్సార్ సీపీ పోరుబాట' ర్యాలీలో పాల్గొన్న అశేష ప్రజానీకం


ర్యాలీలో పాల్గొన్న ఓ దివ్యాంగుడు

నమ్మక ద్రోహంపై..
నిరసనాగ్రహం


జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, టీఎస్ దీపిక, మక్బూల్, అత్తార్ చాండ్‌బాషా, ఈరలక్కప్ప, వజ్రభాస్కర్‌రెడ్డి తదితరులు


ర్యాలీలో ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న రైతు

అందరికీ ధన్యవాదాలు

పెనుకొండ రూరల్: రైతుల సంక్షేమం కోసం శుక్రవారం నిర్వహించిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన, రైతులకు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ తెలిపారు. పుట్టపర్తిలో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమం విజయవంతం కావడంతో శుక్రవారం సాయంత్రం ఆమె పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారమే పరమావధిగా ఎన్నికల వేళ అలవిగాని హామీలిచ్చిన చంద్రబాబు... అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. కనీసం రైతుల సంక్షేమాన్ని కూడా పట్టించుకోలేదన్నారు. అందుకే వారికి అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, కార్యకర్తలు, నేతలు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతోనే అన్ని వర్గాల ప్రజలు ర్యాలీలో భారీ ఎత్తున పాల్గొన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

జనహోరు.. నిరసన జోరు

- పుట్టపర్తిలో కర్షకుడి కవాతు
- రైతన్నకు అండగా వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్
- రైతుకిచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్
- పోలీసు బందోబస్తు మధ్య జేసీకి వినతిపత్రం అందజేత

సాక్షి, పుట్టపర్తి

కర్షకలోకం కడలితరంగమై తరలివచ్చింది. పుట్టపర్తిలో కవాతు నిర్వహించింది. హామీలిచ్చి మోసం చేసిన కూటమి సర్కార్‌పై ధ్వజమెత్తింది. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు వెంటరాగా గణేశ్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకూ గర్జన చేసింది. రైతు సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, అన్నదాతలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పుట్టపర్తిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది.

ర్యాలీగా కలెక్టరేట్‌కు..

పుట్టపర్తిలోని గణేశ్ సర్కిల్ నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి), తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (రాప్తాడు), టీఎస్ దీపిక (హిందూపురం), ఈరలక్కప్ప (మడకశిర), మక్బూల్ (కదిరి), వివిధ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలిరావడంతో గణేశ్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు రహదారి కిటకిటలాడింది. కిలో మీటరు దూరమున్న కలెక్టరేట్ చేరుకునేందుకు గంటకుపైనే సమయం పట్టింది. దారి వెంట మహిళలు, ప్రజలు రైతులకు మద్దతుగా పోరాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలకు బ్రహ్మరథం పట్టారు. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు 'సీఎం డౌన్ డౌన్.. సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు హోరెత్తించారు. కలెక్టరేట్ వద్ద మోహరించిన పోలీసులు కొందరు నేతలను మాత్రమే లోనికి అనుమతించారు.

జేసీకి వినతిపత్రం అందజేత..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పార్టీ సమన్వయకర్తలు టీఎస్ దీపిక, ఈరలక్కప్ప, మక్బూల్, మాజీ మంత్రి నర్సేగౌడ, మాజీ ఎమ్మెల్యేలు అత్తార్ చాంద్ బాషా, అబ్దుల్ ఘని తదితరులు జేసీ అభిషేక్ కుమార్‌ను కలిశారు. రైతు సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, ప్రకటించిన సాయం అందజేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మక్బూల్, అత్తార్ చాంద్‌బాషా మీడియాతో మాట్లాడారు.

హాజరైన ప్రముఖులు..

వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు వజ్రభాస్కర్‌రెడ్డి, సాయిలీల, పూల శ్రీనివాసరెడ్డి, పొగాకు రామచంద్ర, గంగుల సుధీర్‌రెడ్డి, వేణురెడ్డి, గుర్రం శ్రీనివాసరెడ్డి, తుంగ ఓబుళపతి, బలరామిరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు..

అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గణేశ్ సర్కిల్ వరకు వాహనాలను అనుమతించారు. అక్కడి నుంచి కాలినడకన వెళ్లనిచ్చారు. కలెక్టరేట్ వరకు ర్యాలీకి అనుమతించారు. ప్రముఖ నాయకులను మాత్రం జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు అవకాశం ఇచ్చారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.


రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మక్బూల్ తదితరులు

చేతకాని ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా.. ఇప్పటి వరకు రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకూ పైసా కూడా ఇవ్వలేదు. ఇదో చేతకాని ప్రభుత్వం. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పక్షంలో ప్రభుత్వం దిగిపోవాలి. అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు అప్పులపాలు అవుతున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆమడదూరంలో ఉంటోంది. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించాలి. – ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

న్యాయం జరిగే వరకూ పోరాటం



రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. ఆరు నెలలు గడిచినా.. రైతులకు ప్రభుత్వం నుంచి పైసా సహకారం, సాయం లేకపోవడం బాధాకరం.
– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు

ధాన్యం ప్రభుత్వమే కొనాలి



భారీ వర్షాలకు రంగుమారిన ధాన్యాన్ని ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలి. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలి.
– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

హామీలు అమలు చేయాలి



రైతులకిచ్చిన హామీలన్నీ అమలు చేయాలి. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి. దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలి. రైతు సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటం ఉధృతం చేస్తాం.
– మక్బూల్, వైఎస్సార్ సీపీ కదిరి సమన్వయకర్త

జర్నలిస్టులపై దాడి హేయం


అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

- 'సాక్షి' ప్రతినిధులపై దాడిని ఖండించిన ఏపీయూడబ్ల్యూజే
- దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి వినతి

పుట్టపర్తి టౌన్: సాగునీటి సంఘాల ఎన్నికలను కవర్ చేసేందుకు వెళ్లిన కడప సాక్షి టీవీ సీనియర్ కరస్పాండెంట్ శ్రీనివాస్, వీడియో జర్నలిస్ట్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై శుక్రవారం వైఎస్సార్ జిల్లా వేములలో జరిగిన దాడిని జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు పాత్రికేయులతో కలిసి అడిషనల్ ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేముల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల వివరాలు సేకరించేందుకు వెళ్లిన పాత్రికేయులపై కొందరు గూండాలు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారన్నారు. అంతేకాకుండా వారి కెమెరాలు, సెల్‌ఫోన్లలను లాక్కొని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. పాత్రికేయులపై జరిగిన దాడిని జిల్లా ఏపీయూడబ్ల్యూజే తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే నియంత్రణ కమిటీలను నియమించాలన్నారు. రాష్ట్రంలో పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, పాత్రికేయులు దివిటి రాజేష్, ఉద్దండం చంద్రశేఖర్, కడప గంగిరెడ్డి, సతీష్, గోపాల్, నాగరాజు, విజయశేఖర్‌రెడ్డి, గంగాద్రి, గణేష్, రవిశంకర్, అంజి ప్రసాద్, నూర్‌బాషా, మనోహర్‌తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

భక్తరపల్లికి బ్రహ్మోత్సవ శోభ


లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

- ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం
- నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం




స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే దంపతులు, అలంకరణలో జిల్లెడుగుంట ఆంజనేయస్వామి

మడకశిర రూరల్: భక్తరపల్లిలో భక్త జనం ప్రణమిల్లింది. రాష్ట్రంలోనే పేరుగాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం, అంకురార్పణతో అర్చకులు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. సంప్రదాయంగా వస్తున్న క్రతువులో భాగంగా తొలిరోజు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హనుమంతయ్య, రామాంజనప్ప కుటుంబ సభ్యులు, ఆంజనేయస్వామి ఆలయంలో గోవిందరాజులు కుటుంబీకులతో ధ్వజారోహణం, అంకురార్పణ, హోమం, హనుమద్ వ్రతాన్ని చేయించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్‌రాజు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దంపతులు స్వామి వారికి, అంజనాదేవికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు కుటుంబసభ్యులతో కలిసి స్వామికి పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కరియన్న, రామాంజనేయులు, వైస్ ఎంపీపీ మూర్తి, ఆలయ ఈఓ నరసింహరాజు, రథోత్సవ కమిటీ చైర్మన్ నర్సేగౌడ్ పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆంజనేయ స్వామి దేవాలయంలో లక్ష్మీనరసింహ స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

వక్క చెట్ల నరికివేత

- రైతులకు రూ.10 లక్షల నష్టం


నరికిన చెట్లను చూపిస్తున్న రైతు కృష్ణమూర్తి

అమరాపురం: మండలంలోని గుణేహళ్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు 300 వక్క చెట్లను నరికివేశారు. దీంతో తమకు రూ.10 లక్షల నష్టం వచ్చినట్లు రైతులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే...గ్రామానికి చెందిన ఈరన్న, కృష్ణమూర్తి, నంజుండప్ప తదితరులు తమ పొలంలో బోరు బావులు తవ్వించుకుని రూ.లక్షలు వెచ్చించి మూడేళ్లుగా వక్క తోటలను సాగు చేస్తున్నారు. ఇంకో రెండేళ్లు ఆగితే దిగుబడి వస్తుంది... ఇలా 70 ఏళ్ల రాబడికి ఢోకా ఉండదు. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీరి వక్కతోటల్లోని 300 చెట్లను నరికివేశారు. శుక్రవారం ఉదయం తోటలకు వెళ్లిన రైతులు విషయం తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మడకశిర నియోజకవర్గంలోనే ఇలాంటి విష సంస్కృతి లేదంటున్నారు. అనంతరం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

క్లుప్తంగా

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 123 క్వింటాళ్ల ఎండు మిర్చిని విక్రయానికి రైతులు తీసుకువచ్చారు. ఈ–నామ్ ద్వారా వేలం నిర్వహించగా... మొదటి రకం మిర్చి క్వింటా రూ.17 వేలు, రెండో రకం రూ.8,500, మూడో రకం రూ.7వేల ధర పలికింది. ఈ మేరకు మార్కెట్ యార్డు సెక్రటరీ చంద్రమౌళి తెలిపారు. ధరలు నిలకడగా ఉన్నాయని, బాగా ఎండించి తీసుకువచ్చిన మిర్చికి మంచి ధర లభ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.

కోర్టుల తరలింపు ప్రక్రియను తక్షణమే ఆపేయాలి



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: సీఐడీ, ఎన్‌డీపీఎస్ కోర్టుల తరలింపు ప్రక్రియను తక్షణమే ఆపేయాలంటూ న్యాయవాదులు నినదించారు. సీఐడీ కోర్టును కర్నూలులోని ఏసీబీ కోర్టుకు, ఎన్‌డీపీఎస్ కోర్టును తిరుపతి కోర్టుకు బదలాయించేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓలను నిరసిస్తూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 9వ రోజూ కొనసాగాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో బి.ఈరమనప్ప, ఎమ్.సతీష్‌కుమార్, డి.సూర్యచంద్రయాదవ్, జీసీ ప్రకాష్, ఎం.చంద్రశేఖర్, ఎం.లోకేష్, ఎ.శ్రీకాంత్, టి.సురేష్, వంశీనాయక్, బి.గౌతమ్ రాజు, బి.పెద్దిరెడ్డి, సి.అశోక్, ఎం.పురుషోత్తం, ఎస్.సుదర్శనరెడ్డి, సూర్యతేజ, రమేష్, కృష్ణ, నరసింహ పాల్గొన్నారు. ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

సర్వ మతాల సారాంశం ఒక్కటే



గంధం వేడుకల్లో పాల్గొన్న సజ్జద్‌బాబా, తదితరులు



సర్వమత సమ్మేళనంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

- దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా
- ఘనంగా సర్వమత సమ్మేళనం

పెనుకొండ: సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, భగవంతుడు ఒక్కడే అని పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా పేర్కొన్నారు. పెనుకొండలోని బాబాయ్య స్వామి దర్గా ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సర్వమత సమ్మేళనం ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏ మతం వారైనా దేవుడిని పూజించడం సర్వ సాధారణమన్నారు. అయితే ఇతర మతస్తుల ఆచార వ్యవహారాలు, సంస్కృతిపై అసహనం పెంచుకోవడం భావ్యం కాదన్నారు. ఏ మతం వారయినా అందరినీ సమానంగా ప్రేమించాలని, ప్రేమ... అనురాగం... ఆప్యాయతలతో జీవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని మహిమాన్వితుడు బాబయ్య స్వామి నాడే బోధించారని గుర్తు చేశారు.

పట్టు చాదర్ సమర్పించిన మంత్రి సవిత

పెనుకొండ: బాబయ్య ఉరుసు సందర్భంగా స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు చాదర్‌ను మంత్రి సవిత శుక్రవారం రాత్రి సమర్పించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా, మత పెద్దలు ఆమెను గౌరవపూర్వకంగా బాబయ్య దర్గా వద్దకు పిలుచుకెళ్లారు. మంత్రి చాదర్‌ను అందజేయగా పీఠాధిపతితో పాటు ఇతర మతపెద్దలు బాబయ్య మహాసమాధిపై ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



చాదర్‌ను తీసుకువస్తున్న మంత్రి సవిత

సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు శాంతి సందేశాలను వినిపించారు. బాబయ్య స్వామి మహిమలను కొనియాడారు. అనంతరం పలువురికి దర్గా తరఫున సన్మానం చేసారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మొదటి గంధం వేడుకలు..

శుక్రవారం రాత్రి బాబయ్య స్వామి మొదటి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. సజ్జద్‌బాబా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సజ్జద్‌బాబా, ఆయన సోదరులు పాల్గొన్నారు. రాత్రి 10 గంటల సమయంలో డప్పు వాయిద్యాల నడుమ తమ గృహం నుంచి గంధాన్ని తలపై ఉంచుకుని కోలాహలంగా బాబయ్యస్వామి దర్గాకు చేరుకుని మహాసమాధికి అవనతం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

రాయదుర్గంటౌన్: పట్టణంలో తప్పిపోయిన ఓ బాలుడిని ఉపాధ్యాయులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. విజయవాడ ప్రాంతానికి చెందిన గుల్జార్‌బీ తన ఆరేళ్ల కుమారుడు జహీర్‌తో కలసి రాయదుర్గంలోని కోట ఏరియాలో ఉన్న బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చింది. శుక్రవారం ఉదయం జహీర్ ఇంటి బయట ఆడుకుంటూ తప్పిపోయి బళ్లారి బస్టాండ్ వద్దకు చేరుకుని, బళ్లారికి వెళ్లే బస్సు ఎక్కి కూర్చున్నాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని విధుల నిమిత్తం కల్యం గ్రామానికి వెళుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుమతి, మోహన్‌రెడ్డి గమనించి ఆరా తీశారు. బాలుడు తప్పినట్లుగా నిర్ధారించుకున్న వారు.. కల్యం గ్రామం రాగానే తమతో పాటు బస్సులో నుంచి దింపి పాఠశాలకు పిలుచుకెళ్లి, విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఈ అంశాన్ని కోట ఏరియాలోని మహిళ చూసి బాలుడిని గుర్తించి సమాచారం ఇవ్వడంతో బంధువులతో కలసి తల్లి కల్యం గ్రామానికి వెళ్లి ఉపాధ్యాయులను కలిసింది. సురక్షితంగా బాలుడిని అప్పగించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపింది.



హత్యకేసులో ఇద్దరికి యావజ్జీవం

- అనంతపురం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న దృశ్యం

అనంతపురం: యువకుడిని హత్య చేసిన కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివరాలు... అనంతపురం నగరంలోని కోవూరునగర్‌లో నివాసముంటున్న రెడ్డి మణికంఠ, లింగుట్ల రాజశేఖర్ నాయుడు, షేక్ నబీరసూల్ స్నేహితులు. మణికంఠ ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. ముగ్గురికీ మద్యం సేవించే అలవాటు ఉంది. తనకు మద్యం ఇప్పించాలంటూ తరచూ స్నేహితులు మణికంఠ ఇబ్బంది పెట్టేవాడు. ఇప్పించకపోతే గొడవ పడేవాడు. దీంతో అసహనానికి గురైన రాజశేఖర్‌నాయుడు, నబీరసూల్ 2019, డిసెంబర్ 21న మద్యం తాగుదామంటూ మణికంఠను పిలుచుకుని బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామ సమీపాన పొలాల్లోకి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం మత్తులో ఉన్న మణికంఠ తలపై సుత్తితో బాది హతమార్చారు. అనంతరం అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పాతిపెట్టారు. అయితే తన కుమారుడు కనిపించడం లేదంటూ మణికంఠ తల్లి శాంతికుమారి చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి నాల్గోపట్టణ సీఐ రాజశేఖర్ మిస్సింగ్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన కత్తి శ్రీనివాసులు దర్యాప్తు ముమ్మరం చేసి మణికంఠను హత్య చేసినట్లుగా నిర్ధారించుకున్నారు. పక్కా ఆధారాలతో రాజశేఖర నాయుడు, నబీరసూల్‌ని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి కేసు వాదనలు జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో కొనసాగుతూ వచ్చాయి. పది మంది సాక్షులను న్యాయస్థానం విచారించింది. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ యావజ్జీవ కఠిన కారాగా శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సి. సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ ఈశ్వరమ్మ వినిపించారు.

వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండలోని జగనన్నకాలనీలో నివాసముంటున్న శ్రీనివాసులు (49)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల చిన్న కుమార్తె ఎవరికీ తెలియకుండా ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన ఆయన శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిప్పంటుకుని మహిళకు తీవ్ర గాయాలు

గుంతకల్లు రూరల్: కట్టెల పొయ్యి అంటిస్తూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మండల పరిధిలోని గుర్రబ్బాడు గ్రామానికి చెందిన లక్ష్మి తీవ్రంగా గాయపడింది. రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు... శరత్‌బాబు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. దంపతులిద్దరూ కట్టెలు కొట్టుకుంటూ, కూలి పనుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం లక్ష్మి ఇంట్లో పొయ్యి అంటించేందుకు ఆటో కోసం తెచ్చిన పెట్రోల్‌ను వాడింది. ఆ సమయంలో మంటలు భారీగా ఎగిసిపడి చీరకు అంటుకున్నాయి. మంటల్లో చిక్కుకున్న లక్ష్మిని ఇరుగుపొరుగు వారు గమనించి కాపాడి, గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

ఆర్టీసీ కార్గో సేవల్లో నిర్లక్ష్యం

కదిరి: ఆర్టీసీ కార్గో సేవలు గాడి తప్పాయి. సంస్థపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని సిబ్బంది వమ్ము చేస్తున్నారు. ఎంతో విలువైన పార్సిల్‌ను భద్రంగా గమ్యస్థానం చేర్చాల్సిన ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. వివరాలు... కదిరికి చెందిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డికి ఆయన మిత్రుడు ఒకరు శుక్రవారం విజయవాడ నుంచి కదిరికి ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీస్(ట్రాక్ నెం.61601687) ద్వారా కొన్ని విలువైన డాక్యుమెంట్లను పంపారు. ఆ పార్సిల్ విజయవాడ నుంచి ఒంగోలు, కడప, పులివెందుల మీదుగా కదిరికి చేర్చాల్సి ఉండగా మరో మార్గంలో అనంతపురానికి చేర్చారు. అక్కడి నుంచి కదిరికి వెళ్లే బస్సులో కార్గో సిబ్బంది వేశారు. విషయాన్ని గమనించిన డ్రైవర్ మార్గమధ్యంలో బత్తలపల్లి వద్ద రోడ్డుపై దానిని విసిరేసి వెళ్లాడు. విషయాన్ని గమనించిన అటుగా వెళుతున్న కుమార్ (సెల్‌నెం.91773 202790) ఆ పార్సిల్‌పై ఉన్న నంబర్ ఆధారంగా సుధాకర్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. తర్వాత కదిరికి వస్తున్న మరో ఆర్టీసీ బస్‌లో ఆ పార్సిల్‌ను సదరు వ్యక్తికి చేర్చాడు. ఆర్టీసీపై ఎంతో నమ్మకంతో కార్గో పార్సిల్ ద్వారా డాక్యుమెంట్‌లు పంపితే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? అంటూ బాధితుడు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కదిరి డిపో మేనేజర్ మైనుద్దీన్‌ను సంప్రదించేందుకు పలుమార్లు 'సాక్షి' ప్రయత్నిస్తే ఆయన అందుబాటులోకి రాలేదు.



రోడ్డుపై పడేసి వెళ్లిన పార్సిల్ ఇదే

ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలి

- డీఐఈఓ రఘునాథరెడ్డి

తాడిమర్రి: ఇంటర్ విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలంటూ ప్రిన్సిపాళ్లకు ఇంటర్ బోర్డు జిల్లా విద్యాశాఖాధికారి (డీఐఈఓ) ఎ.రఘునాథరెడ్డి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమై మాట్లాడారు. తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం 428 మంది విద్యార్థులు ఉండగా 202 మంది విద్యార్థులకు అపార్ చేసి 47 శాతం ప్రక్రియ పూర్తి చేశారన్నారు. మిగిలిన 53 శాతం అపార్ త్వరతగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 17 నుంచి 23 తేదీ వరకూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అర్ధ సంవత్సర పరీక్షలు నిర్వహించాలన్నారు. అధ్యాపకులు స్వయంగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి వేసిన మార్కులను 27న ఆల్‌లైన్ చేయాలన్నారు. అలాగే తొలి విడత ప్రీ ఫైనల్ పరీక్షలను జనవరి 20 నుంచి 25వ తేదీ వరకు, రెండవ ప్రీ ఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణ పరీక్ష రాసి, తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలన్నారు. ఈ పరీక్షకు గైర్హాజరైనా పరీక్ష ఫెయిల్ అయినా వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులుగా పరిగణించబరని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్ బోర్డు అందించిన సంకల్ప్–2025 మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, పోతలయ్య పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీఐఈఓ రఘునాథరెడ్డి

ఏకగ్రీవానికి కూటమి నేతల కుయుక్తులు

హిందూపురం అర్బన్: నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరగాల్సి ఉన్నా ఇప్పటికే కూటమి నేతలు కుట్రలు పన్ని వారికి కావాల్సిన వారి జాబితాలు సిద్ధం చేసి అధికారులకు అందజేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష డైరెక్టర్లు ఎవరని నిర్ధారిస్తూ పేర్లు ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా 44 సంఘాలకు శనివారం ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో ఆయా చెరువుల కింద ఉన్న ఆయకట్టుదారులందరూ ఓటర్లుగా ఉన్నారు. అయితే ఇందులోనూ టీడీపీ నేతలు కుట్రలు సాగించి తమకు అనుకూలమైన వారి పేర్లతో ఓటరు జాబితా సిద్ధం చేశారు. అంతటితో ఆగకుండా ఎన్నికలను ఏకగ్రీవం చేసుకునేందుకు పోటీకి సిద్ధమైన రైతులను భయభ్రాంతులకు గురి చేసి, స్వచ్ఛందంగా వైదొలిగేటట్లు పావులు కదుపుతున్నారు.

కుంటలో చిన్నారి మృతదేహం

కనగానపల్లి: అభం శుభం తెలియని ఓ చిన్నారి మృతదేహం నీటికుంటలో తేలింది. కనగానపల్లి మండలం పర్వతదేవరపల్లి సమీపంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన వెలుగు చూసింది. ఆటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ జీవీ ప్రసాద్, ఎస్ఐ రిజ్వాన్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 11 నెలల వయసున్న చిన్నారి మృతదేహాన్ని ఓ బ్యాగులో మూట కట్టి పడేసి వెళ్లినట్లుగా ప్రాథమిక విచారణ నిర్ధారణ అయింది. కుళ్లి పోయి ఉండడంతో నాలుగైదు రోజుల క్రితమే మృతదేహాన్ని పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. పంచనామా అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



నీటికుంటలో తేలుతున్న చిన్నారి మృతదేహం

కొడికొండ చెక్‌పోస్టు వద్ద నిరంతర తనిఖీలు

హిందూపురం: కొడికొండ చెక్‌పోస్టు వద్ద నిరంతర తనిఖీలకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. చెక్‌పోస్టు వద్ద సీసీకెమెరాల ఏర్పాట్లను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ జి.మునిస్వామి, జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, పుట్టపర్తి ఏఈఎస్ నరసింహులుతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, కొడికొండ చెక్‌పోస్టు సీఐ రాంమోహన్, ఎస్ఐ ఫరూక్, సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అధికారులు

ముగిసిన పౌరరక్షణ వలంటీర్ల శిక్షణ

గుంతకల్లు: విపత్తుల సమయంలో పౌరరక్షణ (డిఫెన్స్) వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని డీఆర్ఎం విజయ్‌కుమార్ కొనియాడారు. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 62వ ఆల్ ఇండియా సివిల్ డిఫెన్స్ అన్యూవల్ డే ముగింపు కార్యక్రమాన్ని స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధాకర్, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్‌కొట్లా, డిప్యూటీ సెక్రటరీ కేఎల్ఎన్ స్వామి, సివిల్ డిఫెన్స్ ఎమర్జెన్సీ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ సివిల్ అండ్ డిఫెన్స్ ఎస్.చెజియన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే సివిల్ డిఫెన్స్ జెండా ఆవిష్కరించి, వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డిఫెన్స్, సివిల్ దళం, వలంటీర్లు, రైల్వే రక్షణ దళం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా సివిల్ డిఫెన్స్ వలంటీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డీఆర్ఎం మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో డిఫెన్స్ ఉద్యోగులు, వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ క్యాప్టెల్ ఆరోరా, సీనియర్ డీసీఎం మనోజ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను సర్పంచ్ పెద్దనాగరాజు, అర్చకుడు బాలాంజనేయ స్వామి ప్రారంభించారు. 17 జతల వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా సంతమగులూరు గ్రామానికి చెందిన రైతు వజ్రాల తేజశ్రీ రెడ్డి వృషభాలు 4,508 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు రెండో బహుమతి, సింగనగుంట్ల గ్రామానికి చెందిన జూటూరు రామకృష్ణారెడ్డి వృషభాలు మూడో బహుమతి, నంద్యాల జిల్లా కొత్తకోట డాక్టర్ గురునాథ్ వృషభాలు నాల్గో బహుమతి, కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గోపాలగౌడ్ వృషభాలు ఐదో బహుమతి, నంద్యాల జిల్లా పెండేకల్లు గ్రామానికి చెందిన నాగభూషణం వృషభాలు ఆరో బహుమతి, మల్లెల రాజు వృషభాలు ఏడో బహుమతి, పెద్దచెర్ల గ్రామానికి చెందిన చెన్నకేశవ వృషభాలు ఎనిమిదో బహుమతి గెలుచుకున్నాయి. విజేత వృషభాల యజమానులను నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కాగా, కాగా, ఆంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అర్చనలు , అభిషేకాలు పెద్ద ఎత్తున్న జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన వసతిని ఏర్పాటు చేశారు. రాత్రికి నిర్వహించిన నాటక ప్రదర్శన భక్తులను అలరించింది.



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

కసాపురం.. సింధూర వర్ణమయం





ఇరుముడి ద్రవ్యాలతో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని అభిషేకిస్తున్న దృశ్యం, హనుమద్ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

వేలాదిగా తరలివచ్చిన ఆంజనేయస్వామి మాలధారులతో శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సింధూరవర్ణంతో కాంతులీనింది. ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. ఆంజనేయస్వామి మాలధారుల మండల దీక్షలు ముగియడంతో శుక్రవారం ఆలయంలో హనుమద్ వ్రతాన్ని శోభాయమానంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించిన అర్చకులు... అనంతరం మాలధారుల ఇరుముడుల ద్వారా సమర్పించిన ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ప్రత్యేక పుష్పాలు, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. హనుమద్వ్రతం విశిష్టత, నెట్టికంటి ఆంజనేయస్వామి క్షేత్ర మహిమను వేదపండితులు వివరించారు. అనంతరం మహామంగళహారతితో హనుమద్ వ్రతాన్ని ముగించి భక్తులకు, మాలధారులకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతోపాటు ఆయన సోదరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.



హనుమద్ వ్రతంలో పాల్గొన్న భక్తులు

– గుంతకల్లు రూరల్: